# గోపమ్మ తల్లి

శ్రీ వేమూరి వెంకటరామనాథం

రామయ్య రంగయ్య కొయ్యబారి నిల్చున్నారు. గోపమ్మ తల్లి తన జబ్బుకళ్ళతో వారిని దగ్గఱకు పిలిచింది. నడవలేని కాళ్ళు ఈడ్చుకుంటూ మంచం ప్రక్కకు చేరారు.

"నాయనలారా, మీ ఋణం నాకు తీరింది—" అంటూ ఏదో చెప్పబోయి, పెదవుఱారక వారిద్దరి చేతులు నిమురుతూ కదలలేని కనుబొమలతో విషాద కావ్యాలల్లుతూ పెనుగులాడుతున్నది గోపమ్మ.

రామయ్య వెక్కి వెక్కి ఏడ్వ మొదలు పెట్టాడు. రంగయ్య కొంచెం ధైర్యం చేసుకు అన్నాడు, "నన్ను చిన్ననాటినుంచి పెంచావు పిన్నీ, తల్లి తండ్రిలేని నాకు నీవే తల్లిగా, నీవే తండ్రిగా—" అంటూ మొగం వేలవేసి అతడు బోరున ఏడ్చాడు.

రంగయ్య గోపమ్మ కొడుకు కాదు, కాని తెలియనివారు కొడుకని అనుకోవచ్చు. అతడు పదేళ్ళ బాలుడై ఉండగా అతని తండ్రి చనిపోయినాడు. అప్పటికే తల్లిలేని బిడ్డ. దానితో ఏకాకి అయిపోయినాడు. ఇంత ఆస్తిఅయినా యిచ్చిపోలేదు రంగయ్య తండ్రి. అతడు పొలం పుట్ర లేనివాడు. ఆకులు, అలములు, మూలికలు, ఏవో ప్రోగుచేసి వైద్యం చేస్తూ పొట్టపోసుకొనేవాడా ఊరిలో. రంగయ్యకు వాని ఆస్తిగా వాని జ్ఞాపకంగా మిగిలిన వా మందు దినుసులు కొన్నిమాత్రమే. నాటినుండి గోపమ్మ తల్లి ముద్దుమురిపెంతో పెరుగుతూ వచ్చాడు. నిజానికి రంగయ్య పూరికొంపలో తన ముసలి అత్తయ్య ఉండనే ఉంది, తుది అండగా. కాని గోపమ్మఅంటే వానికి తల్లిరూపు అయిపోంది.

ఆమె నిట్టూర్చుతూ అన్నది, "అబ్బాయి, ఏవేళకేమో, ప్రొద్దునే కరణంగారిని పిలిపించి విల్లు వ్రాయించాను."

రామయ్యకున్న ఆస్తిఅంతా తల్లి పేరనే ఉంది. తల్లిమాటలువింటూ బావురుమని ఏడ్చాడు రామయ్య.

"అప్పుడే విల్లా! ఈ విల్లుతో నాకిక తల్లిలేదా" అంటూ తలగడదిండు పైకెత్తాడు.

గోపమ్మ విల్లు కాగితం పైకి తీస్తుండగా రంగయ్య అన్నాడు, "తొందరలేదు పిన్నీ; నీముఖం చూస్తే ఏదో తేటగానే అగుపడుతోంది—"

గోపమ్మ అతని బుగ్గలు నిమురుతూ "నీ ఊహకేం నాయనా, నా స్థితి నాకు తెలుసు," అంటూ నిట్టూర్చి, "మీ నాన్న వాసన నీకింకా పోలేదు. ఆయన అన్నది వేదవాక్యంలా నిలిచేదిరా" అంటూ మెచ్చుకొన్నది.

బిక్క మొగం పెట్టి రంగయ్య గొణుగుకొన్నాడు, "మా నాన్న వైద్యమైనా నాకు పూర్తిగా అంటలేదు."

"ఆయువుంటే అదెంత నాయనా" అంటూ రామయ్యకు విల్లు కాగితం అందించింది గోపమ్మ. రామయ్య అంతా ఎగాదిగా చూశాడు. మొగం చిట్లించుకొన్నాడు. ఇందాకటి విచారమంతా ఎగిరిపోయి, ముఖంలో కోపం తాండవించింది. త్రాచుపాములా బుసలుకొడుతూ కాగితం తల్లి కాళ్ళపైకి విసిరాడు. గోపమ్మ మెల్లగా అన్నది, "నాయనా, నా పదమూడుఎకరాలలో పన్నెండు నీకే; ఒక్కటి మాత్రం రంగయ్యకు వ్రాశాను. పాపం, పేదవాడు. చిన్ననాటినుంచి నాదగ్గఱే పెరిగాడు. నాకు వాడంటే—"అంటూ రామయ్యను దగ్గఱకు తీసుకోజూచింది.

రామయ్య విదిలించుకొని అంతదూరంపోయి నిల్చొన్నాడు. "నీయిష్టం, పొలం నీదిగదా" అని మ్రోగాడు. రెండుమూడు నిముసాలుండి, "ఇందుకే స్త్రీపేర ఆస్తి ఉండకూడదన్నారు," అనుకుంటూ గదిబైటకు వెళ్లాడు.

రంగయ్య గోపమ్మతో అన్నాడు, "ఎందుకు పిన్నీ, నాకొక ఎకరమిచ్చి వాడిని బాధించటం?"

గోపమ్మ చిఱుకోపంతో అన్నది, "ఛా, కుఱ్ఱ వెధవ, మా రాముడిమాటకే యింత ఇది అవుతావా?"

ఆనాటినుండి రామయ్యతీరు మారింది. తన ఖండంలో ఒక్క ఎకరం పోయిందని తన చిన్ననాటి రంగయ్యపై కారు వహించాడు. గోపమ్మమాత్రం ఎన్నిసార్లో నచ్చచెప్ప చూచింది, కాని వ్యవహారంలో రామయ్య స్వార్థం విడువలేకపోయినాడు.

రామయ్య అదృష్టమో దురదృష్టమో కాని, గోపమ్మ తాను భయపడ్డట్లు వెంటనే చావలేదు. రంగయ్యనోటిచలవనేమో ఆమె మొగం తేటపడి, కన్నులు మఱల తెల్లవడి, ఒడలంతా తిరిగి బలం చేకూరజొచ్చింది. ఆ జబ్బుకు గోపమ్మ బ్రదకటం ఊరివారందరికి ఆశ్చర్యంగా ఉంది.

రోజూ వచ్చిపోతున్నట్లే రంగయ్య గోపమ్మ యింటికి వెళ్లాడు. ఆమెకు పూర్తిగా స్వస్థతచిక్కింది. విల్లువ్రాసి ఇరువది దినాలయింది. కాని అది రిజిస్టరు చేయనేలేదు. గోపమ్మ అన్నది, "రంగయ్యా, విల్లు రిజిస్టరీ చేయించాలి. కర్మంచాలక బ్రదికానుగాని—"

రామయ్య అప్పుడే గదిలోకి వచ్చాడు, "ఏం రంగయ్యా, అప్పుడే మంచమెక్కి కూర్చున్నావు. ఆ ఎకరం పొలం రిజిష్ట్రీ చేయించుకో, పో" అన్నాడు.

లేవపోతే రంగయ్యను కూర్చుండబెట్టి గోపమ్మ అన్నది, "పోదాం రా రామయ్యా" అది కాస్తా చేయించుకువస్తే నా మనస్సు కుదుట పడుతుంది."

"నేను రాను, ఈరోజు ఎండ మండిపోతోంది, చాపమీద కూర్చుండి రామయ్య విసనకఱ్ఱతో విసరుకొంటున్నాడు.

"పోదలచుకుంటే మీ అమ్మను నడపించుకునే తీసుకుపోవాలా రామయ్యా? మన రెండెడ్లబండీ కట్టించుకు పోరాదూ" అన్నాడు రంగయ్య.

విసనకఱ్ఱ నేలకొడుతూ రామయ్య అరిచాడు, "మన రెండెడ్లబండీ! మనదిట మనది! అదికూడా వ్రాయించుకొన్నావా? హుం...అది కొన్నది నేను, ఈమె ఎవరు వ్రాసేందుకు?"

రంగయ్య తెల్లపోయి "ఎందుకలా లేనిపోని అర్థాలు తీస్తావు?" అన్నాడు.

"నీ అర్థాలు నాకు తెలుసులేవోయి. నాకూ బుఱ్ఱ యిచ్చాడు దేవుడు" అంటూ చటుక్కున లేచాడు, వెళ్ళిపోవాలని.

తల్లి అన్నది, "ఒరే రామా, ఎందుకురా అంత మటమట లాడుతావు? బండి కట్టుపోదాం. రంగడు చెప్పేది బాగానే ఉంది."

"నేను రాను, నాకు పొలంలో పనిఉంది, అడుగో వాడినే తీసుకుపో, రిజిష్ట్రీ చేయించుకు వస్తాడు. హుం...బోడి రిజిష్ట్రీ, పొలం రిజిష్ట్రీ అయితే పైరు తన దయినట్లే!" అంటూ రామయ్య చరచరా బైటకు పోయినాడు ఎడ్లను తోలుకొని.

గోపమ్మ నిట్టూర్చి అన్నది, "రంగా, రాముడింకా కుఱ్ఱవాడు. ఏమీ ఇదికాకు. అన్నం తినిరా. ఇంతలో వాడు ఎడ్లు త్రిప్పుకు ఇంటికివస్తాడు. త్వరగా రానాయనా, పొరుగూరుకూడ పోవాలి, పెందలకడ ఎండపడకుండా తిరిగివత్తాం."

ఒక జాము సేపటిలో రంగయ్య తిరిగివచ్చాడు. అప్పటికే రామయ్య ఎడ్లను త్రిప్పుకువచ్చాడు, అన్నంతిని వసారాలో నడుం వాల్చాడు. గోపమ్మ వాకిలి గుమ్మందగ్గఱ రంగయ్యకోసం ఎదురుచూస్తూ నిల్చుంది. రంగయ్య అలా దూరాన ఉండగానే బండీ దగ్గఱకు నడచింది. వస్తూనే రంగయ్య ఎడ్లజతను విప్పి బండీకట్టాడు. అంతా సిద్ధమయింది. ఆమె బండీ ఎక్కబోతున్నది. రంగయ్య ఎడ్లమూపురం దువ్వుతూ మువ్వలు మ్రోగించాడు.

పడుకుని ఉన్న రామయ్య చర్రున లేచాడు, ఒక్కగంతున బండీ దగ్గఱ కెగిరాడు. ఎడ్లజతను తటాలున విప్పాడు. ఎక్కబోతూ ఉన్న గోపమ్మ కాలు జారి పడినంతగా అదురుతిన్నది. ఎడ్ల మువ్వలు మ్రోగిస్తూ, "నీ అబ్బగాడి సొమ్ములా కట్టావే, ఇప్పుడేగా పొలంలో చచ్చిపోయి వచ్చినాయి! నీకేం, ఇంత తిని వచ్చావు! గొడ్లకష్టంకూడా చూడాలిరా రంగయ్యా, మనకో ఎకరం వస్తే సరికాదు." అంటూ చావడిలోకి పోయాడు.

పదకొండుగంట లయింది. సూర్యుడంత తీక్ష్ణంగా లేడు. వచ్చేవి సంక్రాంతిరోజులు. ఆకాశమంతా లేతిమబ్బులు తేలుతూ చల్లగా తెల్లగా ఉన్నది. రోజులు జరిగినకొలది పండుగపనులువచ్చి పడతాయి; తీరిక అన్నమాటే ఉండదు గోపమ్మకు. కొడుకుతరహామాస్తే ఇలా ఉన్నది. ఏమనుకున్నాడో అనుకొన్నది, ఆనాడేపోయి రిజిష్ట్రీ చేయించుకు వస్తానని కాలినడకను ప్రయాణమయింది.

మైలున్నర నడవాలి. కాయకష్టంతో ముదుసలియైన గోపమ్మకు అదొక లెక్కకాదు. పైగా ఎక్కడ

లేని పట్టుదల లోపల దహించుకు పోతోంది, పాదాలను పురిగొల్పుతోంది త్వరితంగా.

రంగయ్య ఆమెవెంట పోలేదు. పోరాదనుకొన్నాడు. ఒంటరితల్లిని అలా పంపటమెలాఉన్నా, రామయ్యకు వెఱచి వెంటపోలేదు. పోరి వ్రాయించుకొని, వెంటబోయి రిజిష్టరు చేయించుకొన్నాడన్న అపవాదు వేస్తాడని భయపడ్డాడు. అసలు తాను కోరాడా, ఇమ్మన్నాడా యీ ఎకరం పొలం! చావు భయంతో ఇచ్చిన గోపమ్మ బ్రతికి బాగానే ఉంది; పుచ్చుకొన్న తనకుమాత్రం చావుగా ఉంది.

అలాగే ఆలోచనగా తన పూరి కొంపలో కూర్చున్నాడు రంగయ్య. తల పైకెత్తాడు. వసారా చూరులో ఏదో ప్రాతకట్ట కనపడింది. తటాలున అది తెఱచి విప్పాడు. ఒక్కసారిగా వేడి కన్నీరు వఱదలుగా కార్చాడు. ఎన్నడో పోయిన తండ్రి గుర్తు వచ్చాడు. అవి తన తండ్రి వైద్యపత్రాలు. అందులో ఏవో మందులపేర్లు, అవి చేసేపద్ధతులు, మూలికలు, ఆకులు, కాయలు...ఏవేవో వ్రాసి ఉన్నాయి. రంగయ్య వైద్యంలో అజ్ఞాని కాదు. చదివి అర్థం చేసికో గల శక్తి ఉన్నది. అతని కెన్నో మూలికలు తెలుసు. అతడెన్నో ఆకుమందులు నూరాడు. ఎన్నో దినుసులు, వానితత్వం, ఎఱిగి ఉన్నాడు.

ఆ కాగితాలు దీక్షగా త్రిప్పాడు. గాఢంగా ఒక్క నిట్టూర్పు విడిచాడు. మనసులోనే దేవుడికి దణ్ణం పెట్టుకొన్నాడు. తన తండ్రివిద్యలో తానూ కృషిచేయ నిశ్చయించుకొన్నాడు. గబగబా గదిలోని ప్రాతబీరువా తెఱచాడు, అందులో మందు పదార్థాలెన్నో పొట్లాలుకట్టి ఉన్నాయి. ఆ పేర్లన్నీ చదువుకొన్నాడు. ఆనాడే తనకు వైద్యం కరతలామలకం అయినట్లు విఱ్ఱవీగాడు. ఆ క్షణంలోనే తాను ధన్వంతరి అయినంత తృప్తితో పొంగిపోయినాడు.

ఇలా ఎంతకాలం వెళ్లబుచ్చాడో కాని, తటాలున గోపమ్మ తల్లి కేక వినబడింది. "అప్పుడే వచ్చావా పిన్నీ? అసలు వెళ్ళలేదాయేం?" అంటూ బైటకు గంతువేశాడు రంగయ్య.

"అదేమి రంగయ్యా, వెళ్ళివచ్చానురా, ప్రొద్దు తిరిగింది. రా" అంటూ నడిచింది, ఆమెముందు; అతడు వెనుక.

మెల్లగా తన నడక కబుర్లు, త్రోవలో దాహమయినదని, ఆఫీసులో ఎంతసేపో కూర్చున్నానని, తిరిగి వచ్చేటప్పుడు కొంతదూరం ప్రక్క ఊరి ఆసామి బండిలో వచ్చానని, అన్ని చెవుతూ ఇల్లుచేరింది. రంగయ్య వాకిలి గడపలమీద కూర్చున్నాడు. గోపమ్మ "శ్" అనుకుంటూ వసారాలో గుంజ నానుకు కూర్చున్నది.

రామయ్య చావడిలో ఉన్నాడు. ఈ అలికిడి విన్నాడు. వికటంగా నవ్వుతూ వాకిటిలోకి వచ్చాడు. రంగయ్య గడపలపైన లేచి ప్రక్కగా అరుగుమీదకు జరిగాడు.

"ఏం మళ్ళీ తయారయినావు...రిజిష్టీ అయిందిలే, మహా వెంటపెట్టుకు వచ్చావు పిన్నిని. ఇక పొలం నీది! హుఁ...పొలం నిండు పంటమీద ఉంది. కోతలరోజులు వచ్చాయి." రామయ్య పళ్ళు బిగించి కటువుగా పలికాడు, "చెబుతున్నా విను రంగయ్యా, సంక్రాంతి నాడే నీ ఎకరం పైరు కోయిస్తాను. చూతాంగా ఈవిడవచ్చి కోసి పెడుతుందేమో నీకు! వ్రాతలేగాని, కోతలుకూడా చేయగలదా యీ తల్లి? సంక్రాంతినాడు పొలం పొలిమేరలోకి రావోయి, నీ మగతనం చూస్తాను."

రంగయ్యకుకూడ కోపం వచ్చింది. తాను కోరని ఎకరం తాను కాదనరాని. గోపమ్మతల్లి తన ప్రాణాని కంటకట్టింది. రామయ్య బాధ యిలా ఎంత కాలం సహిస్తాడు, మారుమాటాడకుండా? ధైర్యం చేసుకు అన్నాడు, "సరే రామయ్యా, దేవుడు నాకూ మగతనం ఇచ్చాడు. చూతాంలే."

రంగయ్య ఈ జవాబు ఈయగలడని రామయ్య అనుకోలేదు. కోపంతో అదరిపోయినాడు, "పడిచావు లేవోయి, ఎదురు వాగుడుకూడాను. నడు నడు గడపలమీద చతికిలపడి కూర్చున్నావు. ఈ రోజునుంచి నా గడప త్రొక్కకు."

రంగయ్య మారుమాటాడలేదు. గోపమ్మవంక చూచి తలవంచుకొన్నాడు. అవంచుకొన్న తల తన యింటిలోనికి పోయి పైకెత్తాడు.

ఆనాటి నుండి రంగయ్య రామయ్య గడప త్రొక్కలేదు. గోపమ్మ తల్లియే ఎప్పుడైనా అటు పోయివచ్చేది. ఈ క్రొత్త అనుభవం రంగయ్యకు దుర్భరంగా ఉండేదేకాని, అది మఱువజేసే మఱొక పట్టుదలలో మునిగి పోయినాడు. వైద్యగ్రంథాలు పఠించటం, ఊరిలోనివారికి తనకు తోచిన మూలికలు, దినుసులు, మందులు, ఈయటం. దీనితో అతనికి దినము దినమే క్రొత్తగా

కనపడేది. చేతి చలవ మంచిదేమో ఇతని మందులు పనిచేస్తూనే ఉన్నాయి చిన్న చిన్న వ్యాధులకు.

వారం పదిరోజులు గడిచినాయి. నాడు సంక్రాంతి. పండుగపనులతో గోపమ్మ రెండుమూడు రోజులనుంచి రంగయ్యయింటికి రాలేదు. సంక్రాంతి ఉదయం లేవగానే రంగయ్యకు గోపమ్మను చూడాలనిపించింది. ఈ పదినాళ్లకతా మరచిన మైపొంగులో రామయ్య ఇంటిముందు ఆగి "పిన్నీ" అన్నాడు. మారులేదు. వంగి చూచాడు, గొళ్లెం పెట్టిఉంది తలుపు. చావడి చూచాడు, ఎడ్లు లేవు. వసారామూలలు చూచాడు కొడవళ్ళులేవు. ఒక్క త్రుటిలో అతనికి వచ్చింది, సంక్రాంతినాడే తన పైరు రామయ్య కోయించుకొంటాడని. గబగబా అలాగే పరుగెత్తాడుపొలంవైపు.

ఆనాటి ఉదయం ఆరు గంటలకే రామయ్య లేచి పదిమంది మాలవాళ్ళతో బయలుదేరి కొడవళ్లు తీసుకు కోరమీసాలు దూసుకుంటూ పొలానికి పోయినాడు.

సంజ వెలుతురు తళుక్కుమనే ముందే మాల వాళ్ళందరు పొలంగట్టుకు చేరారు. కొడవళ్ళు దింపుతూ, శూలాలలాంటి కఱ్ఱలు పైకెత్తి రంగయ్య పొలం కాపరులతో అన్నారు, "బతకాలంటే పరుగెత్తండి. చంపేస్తాం, పొండి."

రంగయ్య కూలీలు గుడ్లు వప్పచెప్పి నిల్చున్నారు. మాలవాళ్లు కొడవళ్లు చేతపట్టుకొని రెండడుగులు పొలంవైపు వేశారు. ఆ సస్యలక్ష్మి పైటచెంగులలో ఎక్కడ దాగున్నదో యింతదాకా, గోపమ్మ తల్లి ప్రత్యక్షమయింది వారిముందు.

పైటకొంగు బిగించి, "ముందు నన్ను చంపి, తరువాత పైరుకోయండి" అన్నది.

మాలవాళ్ళు తెల్లపోయినారు, ఒకరి మొగాలొకరు చూసుకున్నారు. "మఱి రామయ్యగోరు—"

గోపమ్మ నవ్వుతూ అన్నది, "పిచ్చివాళ్ళల్లారా, మీకు రామయ్య మాట కావాలా, నా మాటరా? నే నున్నన్నాళ్ళూ ఏదో యిలా పోనీయండిరా."

మాలవాళ్ళు చల్లపడ్డారు. కఱ్ఱలు అక్కడ పారవేసి కొడవళ్లు బుజాలకు తగిలించుకు వెనుదిరిగారు. గోపమ్మ వాళ్ళను పిలిచింది; అందరు ఒక్కసారి ఆమె ముందుకువచ్చి నిలబడారు. "ఒరేయి, వచ్చిన వాళ్లెలాగో వచ్చారు. రంగయ్య పేదవాడురా, ఈ ఒక్క ఎకరం కోసిపెట్టండిరా."

మాలవాళ్లు మఱుక్షణంలో పొలంలో పడ్డారు. అదేక్షణంలో రంగయ్య ఒకప్రక్కనుండి రామయ్య మఱొకప్రక్కనుండి వచ్చారు. రంగయ్య భయపడ్డాడు, రామయ్య అన్నంతపనీ చేశాడని. రామయ్యవిఱ్ఱవీగాడు రంగయ్యను సాధించానని. ఇద్దరు ప్రక్కకుచూశారు. ఒకేసారి గోపమ్మతల్లి కనపడ్డది. "ఇక్కడకు వచ్చావా" అని యిద్దరు అన్నారు.

"అవునురా నాయనలారా, రంగయ్యపంట రామయ్య కోసుకోకుండా వచ్చానురా. పదండి యింటికి."

* * * *

రోజులు గిర్రున తిరుగుతున్నాయి వైరంలో రోజులు జరిగేవేగంకూడ హెచ్చుతుంది. రోహిణికార్తి చల్లపడ్డది. నిప్పుసెగలతో బుసలుకొట్టే నేలగాళ్ళన్నీ నీటి కాలువలతో నిగనిగలాడినాయి. మండువేసంగిలో తగలబడి అదిరిపడ్డ ప్రపంచమంతా వానకారులో తడిసి పచ్చ పచ్చనయింది.

అవి ఆకు మళ్ళరోజులు. రంగయ్యకూడ తన ఒక్క ఎకరానికి ఆకుమళ్లు పెట్టుకున్నాడు. రామయ్య ప్రక్క చేలలోనుండి ఈదృశ్యం కొరుపగతో రేగె యీసుతో చూసి నీరయిపోయినాడు. నిలిచి కాలుతున్న తన కక్ష ఒక్కసారి చమురుతాకినట్లు భగ్గుమన్నది.

కోపంతో తొట్రుపడుతూ యింటికి వచ్చాడు. వీధికి మధ్యగా లంక మాల వాడు గొంతు కూర్చొని ఉన్నాడు. రామయ్యను చూస్తూనే లేచి ఎదురుపోయి, అంతదూరాన నిలబడి బిగ్గఱగా అన్నాడు, "మీ గేదదూడలు తీసుకొచ్చా రామయ్యగారూ. దయయుంచాల. ఏంకాలం బాబయ్యా ఏంకాలం... మేత వేసేసరికి తాడు తెగేది."

ప్రక్కన నిలబెట్టిన అరుగేదెలను తేరబారి చూశాడు. అందులో నాలుగు తనవి, రెండురంగయ్యవి, కలసిమెలసి ఉన్న వెనుకటిరోజులలో అవి లంకకు తోలారు బాగా బలిసివస్తాయని. కాని అందులో మూడుగేదెలు మాత్రం దిట్టంగా ఉన్నాయి. మిగతి మూడు కొంచెం నదరుగానే ఉన్నాయి. రామయ్య చరచరా ఆమూడింటినీ, నదరువానిలో ఒకటీ, తోలుకుపోయి చావడిలో కట్టివేశాడు.

మాలవాడు తెల్లపోయినాడు. "రామయ్య గారూ, అయన్నీ తమయేనండీ? ఆమచ్చలగేదె, ఆబోడికొమ్ము రంగయ్యగోరియండి—"

అవి రెండూ బాగా బలిసినవే. అవి వదలలేక పోయినాడు రామయ్యా, అందులో రంగయ్యకోసం. "ఛ, మఱచిపోయినావురా, ఇవే మావి." అంటూ గదమాయించాడు రామయ్యా.

"నామాట యినండి బాబయ్యా, ఇయ్యండీ మనయి," అంటూ మాలవాడు మిగత రెండు బక్క గేదెలను చావడిలోనికి తోలుకువచ్చాడు.

రామయ్యా గ్రుడ్లు పెద్దవిచేసి, "ఏంరా, మీదకు త్రోసుకువస్తావు" అన్నాడు.

మాలవాడు ఆమాట వినిపించుకోనక రంగయ్య రెండు గేదెల పలుపులు ఊడదీశాడు. రామయ్య మండి పోయినాడు, తనమాట వీడు పాటించలేదని. "ఓరి దున్నపోతా, నీ సొంతంలాగ ఇప్పుతున్నావేందోయి మా గేదెలని. నడుముందు చావడి బైటకు" అంటూ రామయ్య గర్జించాడు, చావడిలో నుండి తన మాల పాలేరొకడు కఱ్ఱ త్రిప్పుకుంటూ బైటకు వచ్చాడు.

"నడుత్తాలెండి బాబయ్యా, రంగయ్య గోరి గేదెలు తోలుకే నడుత్తా" అంటూ మాలవాడు గేదెలను బైటకు తోలాడు.

రామయ్య "నీకు మాటలతో కుదరదురా" అంటూ దరిచేరాడు. అతని పాలేరు "నిన్ను పోటు పొడవాలిరా" అంటూ కఱ్ఱ వాని బుఱ్ఱమీదకు విసిరాడు. పాపం మాలవాడి తల పగిలి నెత్తురు వఱద లయింది. లంక మాలవాడు కుంకరైయై వీధిలో సొమ్మసిల్లాడు. రామయ్యా పాలేరు రంయిమని ఆ రెండు గేదెలను చావడిలోనికి లాక్కొని వచ్చాడు.

దొడ్లో ఏదో పనిచేసికొంటున్న గోపమ్మ యీ గల్లంతు విని చావడిలోకి వచ్చింది. "మన గేదెలు వచ్చాయిరా రాముడూ, ఇవాళ ప్రొద్దునే లేచి ఎవరి మొగం చూశానో...వచ్చారూ, మా బంగారు తల్లులు. ఎన్నాళ్ళయిందే, పిల్లులులాగా వెళ్ళారు లంకమేతకు," అంటూ గేదెల నంటి పొంగిపోయింది.

గేదెలు నాలుగింటిని పరిశీలించింది తన ముసలి కన్నులతో, వణుకు చేతులతో. నెమ్మదిగా పెదవి విరుస్తూ, "నాయనా, ఇదెక్కడదిరా, ఈ మచ్చల గొడ్డు మనదికాదురా, ఇది వాడిదిరా" అంది. రామయ్య కినిసి నిల్చాడు. "ఇదీ మనది కాదురా, బోడికొమ్ములది. ఇదీ రంగడిదేరా. మన గేదె కంటిలో సిరి ఉందిరా" అంటూ రామయ్యవంక చూసింది.

రామయ్య కోపంతో గొణిగాడు, "కాదు నీ కంటిలో పొర ఉంది, అంతే."

"పొర పడలేదురా రామయ్యా. ఇవి వాడివేరా, నా చూపింకా ఊడ్చిపెట్టుకు పోలేదురా."

"అవునులే పద, ఆ చూపుతో నేమా చావు దగ్గరకు వస్తోంది" అంటూ రామయ్య గేదెలను కట్టి బైటకు నడిచాడు.

గోపమ్మకూడ వెంట నడుస్తూ, "అయితే అదేమిరా అబ్బాయీ, వాడిని ఎందుకు కొట్టారురా? రామయ్య రంగయ్య గేదెల తగాదాలో లంక మాలవాడికి దేహశుద్ధి! బాగానే ఉంది." అంటూ నిట్టూర్చింది.

రామయ్య వేగంగా వీధిలోకి నడుస్తూ, "అవునులే, అసలువాడికే అంటించాలి గాని, మధ్య మాలవాడి కెందుకు," అనుకొంటూ పొలంవైపు పోయినాడు.

*        *        *        *

వేసంగి రోషం వెనుకపడ్డది. వానల వయ్యారమూ వెలిసిపోయింది. కొలదిగా చలి వేస్తున్నదప్పుడే. ఆయేడు శీతాకాలం కొంచెం ముందుగానే వచ్చినట్లుంది.

రాత్రి పదిగంటలయింది. మాలవాళ్ళను పంపివేసి రామయ్య ఇంటిలోనికి వచ్చాడు. గోపమ్మ తల్లి యింకా నిద్రపోలేదు. కళ్లు నలుపుకొంటూ లేచి కూర్చుండి, "ఏంరా నాయనా, ఇంత రాతిరికూడ నిద్రపోలేదు" అన్నది.

రామయ్య అన్నాడు, "మామకు కబురు పంపానే నీవు వస్తున్నావని. మన సీతిగాడు వెళ్ళి వచ్చాడు."

వాకిటి వసారాలోనుండి సీతిగాడు కేక వేశాడు, "ఱేపు పొద్దున్నే గోపమ్మతల్లిగో రొత్తుండారని సెప్పొచ్చాను తల్లీ!"

గోపమ్మ ముఖం ఇంతయింది. ఎన్నాళ్ళకి వెళ్లబోతున్నది తన తోబుట్టువు యింటికి! ఎప్పుడూ వెళ్లవలె ననుకోటం, ఏదో అడ్డురావటం! కాని యీమారు నిశ్చయించుకొన్నది వెళ్ళితీరాలని. వెను

కటి సంక్రాంతికి వెళ్లకపోతేనే తమ్ముడికి ఇంత కోపం వచ్చింది.

రామయ్య మళ్ళీ అన్నాడు, "అమ్మా, ఱేపు వేకువజాముకే లేచి, పోవే; చల్లగా ఉంటుంది."

"ఱేపే? వేకువనే?" అంటూ గోపమ్మ సందిగ్ధపడ్డది. కనుబొమ్మలు బరువుగా ఆడిస్తూ, కన్నులు లోతుగా త్రిప్పుతూ, మెల్లగా అన్నది "ఉహుం... వెడతాలేరా... ఱేపే యేం తొందర రా—"

సీతిగాడు తిరిగి కేక వేశాడు, నే సెప్పొచ్చా దొరసానీ" అని.

గోపమ్మ కిటికీవద్ద నిల్చొని, "ఒరే సీతిగా, అర్ధరాత్రి అయింది. ఇంటికి పోరా" అన్నది. వాడు తుర్రున ఇంటిదారి పట్టాడు.

గోపమ్మ కొడుకు బుజం తట్టుతూ "నాకేమీ తోచటం లేదురా. ఈ అర్ధరాత్రి వేళ, ఇందరు మాలమాళ్ళను పిలిపించి యేం మంత్రాంగం జరుపుతున్నావో అని భయంవేస్తున్నది. వాళ్ళను దేనికి పురికొల్పుతున్నావో యేం కర్మమో."

రామయ్య ముఖం చిట్లించుకొన్నాడు. తల్లి చేయి విదిలిస్తూ, "నీ వెప్పుడూ ఇంతేనే. నేను ఏంచేసినా, అనుమానం, భయం! నీ కొడుకు సుఖంగా ఉండడం నీకు గిట్టదు!"

రామయ్యపోయి మంచంమీద వ్రాలాడు. ఇక అతనిని కవ్వించరాదనుకొని గోపమ్మ తన మంచంమీద తాను పడుకుంది. ఇరువురికి బాగానే నిద్రపట్టినట్లుంది, తెలతెల వారే వేళదాకా ఎవ్వరూ నల్లి కుట్టినట్లుకూడా కదలలేదు. తొలి పక్షుల కూతలకు రామయ్య ఇటు అటు దొర్లుతూ, "అమ్మా అమ్మా... మఱి లేచి వెళ్ళవులే" అన్నాడు. గోపమ్మ నిద్రకన్నులు తెఱవకుండానే, "శీతాకాలపు ఎండలేగా, ఇంత చద్దితినే వెడతాలే" అన్నది.

ఉదయం తొమ్మిది గంటలయ్యేసరికి రామయ్య అన్నం తిన్నాడు. గోపమ్మకూడా భోజనం పూర్తి చేసి, గిన్నెలు తోముకు ఇల్లంతా సద్దుకుంటూ తన ప్రాతబట్టలు రెండుమూడు కలిపి చిన్న మూటగా కట్టుకొన్నది. మేనకోడళ్ళకోసం దాచిఉంచిన రెండు చుక్కల రవికల గుడ్డలు భద్రంచేసికొన్నది. మరదలి ముచ్చటకోసం కొన్ని విత్తనాలు పొట్టం కట్టి ఉంచింది. మేనల్లుళ్ళకు తేగ లిష్టమని అయిదారు తేగలు, మూటలో వేసికొన్నది. హడావుడిగానే ప్రయాణ ప్రయత్నం చేసింది గోపమ్మ.

రామయ్య పొలానికిపోతూ, "మధ్యాహ్నం వచ్చి నే పెట్టుకుతింటాలే. నీవు వెళ్ళవే," అన్నాడు.

రామయ్య వెళ్ళాడు. కాని గోపమ్మకు రామయ్యను విడిచి వెళ్ళాలన్న దుగ్ధ మధ్యమధ్య మనసులో తళుక్కుమంటున్నది. తను లేకపోతే ఒంటరిగాడు, చిన్నవెధవ, దుడుకుమనిషి, విసువెక్కువ...ఎలా ఉండగలడో ఆమెకు తోచలేదు. ఈ వెఱ్ఱి ఆలోచనలతో మంచంమీద నడుం వాల్చింది. ప్రయాణపు ఉడుకు కాస్త చల్లపడ్డది. పోనీ, రామయ్యకు మధ్యాహ్నంకూడా అన్నంపెట్టి సాయంత్రం వేళనే పోవచ్చును, పైగా అప్పుడు వ్రాలే పొద్దుకూడా, అంత ఆయాసం అనిపించదు ప్రయాణం. గోపమ్మకు చల్లగా నిద్రపట్టింది.

ఒంటిగంట అయింది. ఈలలు వేసికొంటూ రామయ్య తిరిగివచ్చాడు. మధ్యమధ్య ఏవో పదాలు కూడా అంటున్నాడు. గోపమ్మ తన గాఢనిద్రలో ఈరామయ్య ఈలలు పాటలు వినపడ్డాయి, అదేం చిత్రమో. తటాలున మంచం దిగి తలుపు తెరిచింది.

రామయ్య తెల్లపోయినాడు. "నీవు వెళ్ళనే లేదూ?" అన్నాడు. ఆ ఉత్సాహమంతా నీరసించింది. "వెళ్లావనుకున్నానే," అన్నాడు. ముఖమంతా మబ్బులు క్రమ్మినట్లయింది.

"కాదురా నాయనా, నీకు అన్నంపెట్టి మరీ పోదామని—" అంటూ దీర్ఘాలు తీయబోయింది, చెక్కిళ్ళు చేటలంత చేసికొని. "సరే పద. అన్నంపెట్టి పంపించి, నీవూ వెళ్ళవే" అంటూ రామయ్య వంటయింటిలో ఒక్క గంతువేశాడు.

గోపమ్మ తల్లి మురిపెంతో మ్రోగింది. "మేనమామ పోలికరా నాయనా. వాడంటే ఎంత ఆపేక్షరా నీకు! వారి యింటికి నేను పోయి చూసిరావాలని కాదూ నీ మనసు!"

క్షణంలో భోజనం పూర్తి చేశాడు రామయ్య. మఱుక్షణంలో మఱల పొలానికని బయలుదేరాడు. పోతూపోతూ, "నీవు మాత్రం ఇప్పుడే బయలుదేరి వెళ్లు, ఏం" అన్నాడు బిగ్గఱగా.

గోపమ్మ యింట్లో పని పూర్తిచేసికొని ఒక క్షణం విశ్రమించి బయలుదేరింది. తన తమ్ముడిది

నాలుగుమైళ్ళ దూరంలోఉన్న చిన్నలంక, వాగులో నీరు బాగా ఉన్నందువల్ల పడవలు వెడతాయి. ఆ డొంకదారులలో నడిచి ఎన్నాళ్లయిందో!

పది గజాలు నడిచిందోలేదో, రంగయ్య యిల్లు సమీపించింది. "రంగయ్య ఈమధ్య కనపడనేలేదు" అనుకొంటూ ఇంటిబైట ఆగి పిలిచింది. అతని ముసలిఅత్త లోనుండి సమాధానమిచ్చింది, "వైద్దానికో పొలానికో వెళ్లా"డని, "ఇప్పుడు పొలంలో ఏంపని వైద్యానికే" అనుకొంటూ ముందుకు సాగింది. ఏనాటికైనా రంగయ్య తన అయ్యలాగా వైద్యుడనిపించుకొంటే చాలునని మురిసింది.

ఊరి బయటకు వచ్చింది. ఇక పొలాలగుండా పోవాలి. ఏ వేసంగిలోనో అయితే పొలాలమధ్య ప్రయాణం ఎడారిప్రయాణంలాగానే ఉంటుంది. కాని యీరోజులలో పొలాలన్నీ పచ్చపచ్చని పండు ముత్తైదువులలా ఉన్నాయి. రత్నగర్భ అన్నపేరు సార్థకం చేసికొంటున్నది భూదేవి. సస్యలక్ష్మి నీలి పైటలవాలులో ముత్యాలకోవలలాగా ధాన్యరాసి దాగొని ఉంది. ఆపైరుగాలుల జోలపాటలలో ప్రకృతి మాత వయ్యారంగా ఉయ్యాల లూగుతున్నది.

గోపమ్మ తల్లికి పొలాలన్నా పైరులన్నా ఏదో సహజానందం పొంగిపోతుంది. తెఱచిన కన్నులు తెఱచినట్లే పంటవంక చూస్తూ పదములు కదిలిస్తోంది. ఇంకా రెండు నెలలలో ఈ పైరులన్నీ కోతకు వస్తాయి. పైరుకోతలోని అందచందాలు గోపమ్మ తల్లికి తెలుసు. ఇరవై అయిదేండ్లనాడు తానూ తోడి వారితో కలిసి పొలంగట్లపై దుముకుతూ, వరికోపల గుబురులలో దాగుతూ పాడుతూ, కోడవళ్ళ తళతళలలో పొంగుతూ వంగుతూ, పెరుకోతల బడలికలో తూలుతూ సోలుతూ, సస్యలక్ష్మికి హారతులెత్తిన మధురస్మృతులు వెల్లివిరిసినాయి గోపమ్మ హృదయంలో. గోపమ్మ గుండెలలో, గోపమ్మ దేహంలో ఇరవైయేళ్లనాటి యౌవనం క్షణికంగా తొంగితొలకరించింది.

కాని అది క్షణికం...కను ఱెప్పలు తిరిగి తెరిచేసరికి జారిపోయింది, అకస్మాత్తుగా ఆమె గుండెలదిరినాయి, కన్నులు వణకినాయి, ఒడలే కూలపడినట్లయింది. తన కన్నులు తానే నమ్మలేకపోయింది. పది గజాల దూరంలో రంగయ్య! రంగయ్య కనిపించిన ముద్దుకాదు, రంగయ్య స్థితికి ఆమె గుండెలు దహించుకుపోయినాయి. ఆ ఒంటరిగాడి చుట్టు పది మంది మాలవాళ్ళు మూగారు, బిరుసుకర్రలు చేతపట్టుకొని.

గోపమ్మ ఒక్క పరుగున రంగయ్యను దరి చేరింది. మాలవాళ్ళు అదరిపోయినారు. పిడుగుపడ్డ తాటితోపులా బిగిసిపోయినారు.

గోపమ్మ ఏదో అనబోతున్నది. మాలవాళ్ళు ధైర్యం చేసుకు అరిచారు, "గోపమ్మ తల్లిగోరూ, మీ కాళ్లకి వెయ్యి దండాలు. మా పని ఏదో చేయనివ్వండి మీదారిని మీరు పొండి" అంటూ రంగయ్యమీదకు దూకారు.

రంగయ్యను దరిచేరే మాలవాళ్లు తన నెత్తురు నాళాలను ఒత్తుతున్నట్లనిపించింది గోపమ్మకు. తన ఊపిరితిత్తులు పిండుతున్నట్లు అనిపించింది గోపమ్మకు. తన మాట క్రిందపెట్టి బిగువుగా నిల్చొని పల్కింది గోపమ్మ, "రండి. మీ పని ఏదో కానీయండి. కాని నన్ను చంపి మరీ మా రంగడిమీద చెయ్యివెయ్యండి"

గోపమ్మ కొంగు బిగించింది. చేతులు దృఢంగా రొమ్ములకు కట్టుకుంది. పొంగిపొరలే పట్టుదలతో, విచారాన్ని మ్రింగివేసిన దీక్షతో, ఆమె రొమ్ములు, రొమ్ములతో పాటు చేతుల బిగింపులు, పక్షి ఱెక్కలలా రెపరెపలాడినాయి.

మాలవాళ్ళు మందమతులైనారు. చేతులు కాళ్లు ఆడనట్లు కొయ్యబారినారు. కఱ్ఱలు అవే జారినాయి క్రిందకు. కొందరి తలపాగాలు ఊడి సిగ్గిల్లిన చిన్న మొగాలను కప్పివేసినాయి కూడ, "గోపమ్మ తల్లి గోరూ" అంటూ అందరు నేలమీద పడి దండాలు పెట్టారు.

దూరాన ఉన్న రామయ్య ఇదంతా చూస్తూనే ఉన్నాడు. రోషంతో రుసరుసలాడుతూ త్రోసుకు వచ్చాడు తల్లిముందుకు.

గోపమ్మ అప్రయత్నంగా అన్నది, "నీవుండేనా రామయ్యా, రంగయ్య కిలా చేయిస్తున్నావు!"

రామయ్య బొబ్బలు పెట్టాడు, "ఇందుకేనా తల్లీ నీవు ఇంతవఱకు ఊరు దాటిపోలేదు?"

"ఎందుకురా అంత కోరు రంగయ్య అంటే. వాడు నీ తమ్ముడు కాదురా? రామయ్యా, నేనున్నంతవఱకు వాడిమీద ఈగవాలనీయను," అంటూ గోపమ్మ వెనుకదారి పట్టింది.

రామయ్య అన్నాడు, "అవునులే, నీవు బ్రదికి నన్నా ళ్ళే వాడి ఆయువూను."

ఆమాటలు వినలేక గోపమ్మ వేగంగా నడుస్తోంది. రంగయ్య వెంట నే వెడుతున్నాడు. రామయ్య అరిచాడు, "ఏం మళ్ళీ ఇంటిదారి పట్టావు! ఇంత చేశావు...ఇక...మఱి మామయింటికి పోవూ?"

"ఉహుం..." అంటూ గోపమ్మ గబగబా తిరిగి తన యింటికే పోయింది. వాకిటి వసారాలో నే మూట విప్పి, అందులోని తేగలు నాలుగూ రంగయ్య కిచ్చి దీవించింది. రంగయ్య వారి గడప త్రొక్కకుండా నే తేగలందుకొని తిరిగిపోయినాడు.

మఱునాడు ఉదయం గోపమ్మ నిద్రలే చేసరికే తనతో బుట్టువు ప్రత్యక్షమయినాడు, "నిన్న రాలేదేం అక్కా" అనుకొంటూ.

"ఆఁ...ఏదో ఒంట్లో ఉబ్బరం చేసి—" అన్నది గోపమ్మ.

"అలాగా, మన రంగయ్య ఇప్పుడు వైద్యు డయినాడటగా! పోనీ పిలుచుకురానా అక్కా" అన్నాడు.

రామయ్య ఛ్రురనలేచి, "ఏడిశాడులే వాడి వైద్యం వాడూను—" అని కసిరాడు. గోపమ్మ మాత్రం "ఏమో నాయనా, ఎప్పుడైనా ఏదో కషాయం, మూలిక ఇస్తూనే ఉంటాడు. మఱి ఆ రోగం ఉద్ధృతమూ తగ్గుతుంది...సరే నా రోగానికేం, యిది జన్మ రోగం కాని, పిల్లలు బాగున్నారా?" అంటూ కుశల ప్రశ్నలు వేయసాగింది.

"ఆఁ. బాగానే ఉన్నారే, పసిపిల్లలు ఎప్పుడూ కలవరిస్తూ ఉంటారు, అత్తయ్య అత్తయ్య అని. నీవు మాత్రం ఒక్కరోజైనా వచ్చి ఉండవు."

"నే నేం చేయను రా నాయనా......వాడి నడుగు—"

"పోనీ, ఈమాటు సంక్రాంతికైనా రావే అక్కా!"

రామయ్య ముఖం వికసించింది. "అవునే అమ్మ, పాపం మామయ్య ఎంత ముచ్చటపడుతున్నాడో తోడబుట్టు పడుచును తీసుకుపోవాలని. పోనీ వెళ్ళి రాకూడదు టే? ఆఁ......అయినా రాతి గుండెవే నీవు—"

గోపమ్మ నిట్టూర్చుతూ, "రాతిగుండెనయితే విన్న నే వెళ్ళేదాన్నిరా" అన్నది. సంక్రాంతిపండుగ అనగానే గోపమ్మకు గుండె లవిసినాయి. సంక్రాంతి అంటే నిజంగా ఆడువారి కోక కళ, కాంతి. సంక్రాంతి పండుగలో బొమ్మలు, గొబ్బెమ్మలు, ముగ్గులు, గంగిరెద్దులు, మేళాలు, తాళాలు, ఎంతో ముచ్చటగా ఉంటుంది. సంక్రాంతి రోజులలో చుట్టాలు పక్కాలు, ప్రాత నేస్తాలు, క్రొత్త ఆపేక్షలు...ఎన్నో...

పైగా సంక్రాంతి రోజులలో నే భూదేవి ప్రసవిస్తుందీ, వరిపైరును కంటుంది. ఈ ఆలోచన తట్టగానే గోపమ్మ అప్రయత్నంగా చలించింది, తనకు తెలియని కుదుపుతో గుండెలు కొట్టుకున్నాయి. మెల్లగా తలయెత్తి, "తమ్ముడూ, ఈపండుగకు రాను లేరా, సంవత్సరాదికి వస్తానులే తప్పకుండా" అన్నది.

అతడు చిన్నబుచ్చుకు లేచాడు, "ఏమోలేవే.. ఎప్పటి కెలా ఉంటుందో! ఈ దేహాలు శాశ్వతాలా? నలుగురూ ముచ్చటగా కలుసుకోటం నీకు పడదు." అంటూ తన లంకకు తాను పోయినాడు.

రామయ్యకు కోపం వచ్చింది తన తల్లి మొండి పట్టుకు. మంచందగ్గరగా వచ్చి, "నాకు తెలుసులే నీవు సంక్రాంతికి పోని డెంగుకో. కాని యీమారు చూసుకో—" అంటూ మీసం త్రిప్పాడు.

"నా ఒంట్లో ఇంతమాత్రంగా ఉంటే—" అంటూనే గోపమ్మ "అబ్బ, ఏం నొప్పిరా, తలంతా పగిలిపోతోంది" అనుకుంటూ మళ్ళీ మంచంమీద వాలింది.

ఆ పడక పడక ఒకటే "ఏక పడక" అయిపోయింది. ముసలితనంలో ముదిరిన వ్యాధి వానకాలము మబ్బులాగా మన్య మన్య సర్దుకొంటుందే కాని సాంతం పోవటం అసహజం. అందులో రంగయ్యకు తాను పాలమిచ్చి వాని నెత్తికి ఇడుములు పులిమిన మనోవ్యధ కూడ గోపమ్మకు లేకపోలేదు.

రంగయ్యకు తెలిసింది గోపమ్మ స్థితి యేమీ బాగుండలేదని. పది పదునైదు రోజులు ఓపిక పట్టి ఉన్నాడు. కాని పిన్నిని చూడకుండా ఇక ఉండలేక పోయినాడు.

ఒకనాడు ఉదయం తొమ్మిదిగంటలవేళ రామయ్య ఇంటికివెళ్లి, బైట నిల్చొన్నాడు. మిర్రి చూస్తూ ఎదురుకుండా, రామయ్య ప్రత్యక్షమైనాడు. అతడు పొలానికివెళ్ళి ఉంటాడని నమ్మివచ్చాడు

రంగయ్య. అతనినిచూసి తప్పుచేసిన వాడిలా తల వంచుకున్నాడు. రామయ్య ఎగతాళిగా కేక వేశాడు, "ఏమోయి రంగయ్యా, ఆవిడకు మళ్లీ జబ్బు చేసింది. ఏం, ఇంకొక ఎకరం వ్రాయించుకో వచ్చావా? ఆ ఎకరం పైరు నిల్పుకోపోయి చూతాం."

రంగయ్యకు తల పగిలినట్లయింది. గిర్రున తిరిగి యింటికిపోయినాడు. వారం రోజులు గడిచాయి. ఎంత వద్దనుకొన్నా రంగయ్యకు గోపమ్మ పిన్ని యింటిగాలి తిరగనేలేదు. తన్ను ఇన్నిఏళ్లుగా పెంచినతల్లికి జబ్బుచేస్తే తాను చూడపోవద్దా? తన్ను అడ్డగించేందుకు రామయ్య ఎవడు? గోపమ్మతల్లి తరువాత రామయ్యగాని, రామయ్యమాటే రాజ్యమేలదుగా! అనుకుంటూ సాగివచ్చాడు.

ఈనాడూ రామయ్య ఇంటిలోనే ఉన్నాడు. ఇతడిని చూడగానే, గభాలున లేచి నిల్చున్నాడు. "ఏమోయి, నేను లేకుండా చూసి చేరతారాడుతున్నావే! ఇది పాముతోపగ అనుకో, నడుములు విరుగుతాయి గడప త్రొక్కితే, వెధవఎకరానికి ఇంత నిబ్బరమా? మనోవర్తి ఎకరం!"

రంగయ్య మౌనంగా నిల్చోనలేక మెల్లగా "రామయ్యా" అని పిలిచాడు.

"ఏం రంగయ్యా" అంటూ రామయ్య వికటంగా వాని పిలుపు అనుకరించాడు. "ఈఏడు సంక్రాంతి పైరు కోసుకోవోయి, చూతాం నీమగతనం. గోపమ్మతల్లి గూళ్లు కదిలిపడుకుంది, నిన్ను వచ్చి యిక రక్షించలేదు. సంక్రాంతి ఉదయాన పొలంలో కాలుపెట్టావా, మా పాలేరు మాలవాళ్ళ పలుగు పోట్లకు గురిఅవుతావు."

రంగయ్యవెంట తనపాలేరు సుబ్బిగాడు ఉన్నాడు. రంగయ్యను మించిన పౌరుషంతో సుబ్బిగాడి కళ్ళు ఉబ్బిపోయినాయి. రంగయ్య వెనుదిరిగి యింటిదారి పట్టాడుగాని, లేకపోతే సుబ్బిగాడు సుద్దులు చెప్పేవాడే రామయ్యకు.

మెల్లగా నడిచే రంగయ్యకు ముందుగా నిల్చొని సుబ్బిగాడు బొబ్బలుపెట్టాడు, "ఏంటయ్యా రంగయ్య దొరా, ఆరే మా రాజులా, ఆరే మనుషులా? ఏంటా పళంగా ఊరుకుంటారు?"

రంగయ్య నెమ్మదిగా అన్నాడు, "ఒరేసుబ్బిగా, రామయ్య డబ్బుగలవాడురా, ఇంత ఉన్న ఆసామి!"

"అయితే యారికయ్యా? ఈన డబ్బేంటి, యీ నేపాటి? దనం నిలుత్తుందా బాబుగోరూ. పలుకు నిలుత్తుంది, పనులు నిలుత్తాయి మీ పలుకు చలవ, మీ చేతి చలవ మీకు తెలీదు మారాజా. రమ్మనండి, ఏంసేత్తారో సంకురాత్తిరికి. ఈనకేవత్తారా మాలోళ్లు, మీకు రారూ? నేం సేత్తానుండండి—" అంటూ ఉబ్బిపోయినాడు సుబ్బిగాడు.

సంక్రాంతి పండుగ సమీపిస్తోంది. ఊరు ఊరంతా పండుగ పనులతో కోలాహలంగా ఉంది. ఎటుచూచినా క్రొత్త ముగ్గులు, క్రొత్త సున్నాలు, క్రొత్త రంగులు. రామయ్య రంగయ్యల ఇళ్లుమాత్రం మార్పులేని ఎప్పటి కొంపలుగానే ఉన్నాయి. వారి వైరం మాత్రం క్రొత్త క్రొత్త కుబుసంతో క్రొత్త క్రొత్త రోసంతో బుసలుకొట్టే నాగుపాములా విషమంగా పెరిగిపోతోంది.

రామయ్య పదిమంది మాలవాళ్ళను తయారుచేసి ఉంచాడు. రంగయ్యకూ పదిమంది మాలవాళ్ళు అండ నిల్చారు. రామయ్య కర్రలకు ఇండిపన్నులు వేయించాడు. రంగయ్య మాలవాళ్ళు తమ కొరుకోరలే పన్నులుగా మిడిశారు. రామయ్య కొడవళ్లకు పదును పెడుతున్నాడు. రంగయ్య మాలవాళ్ళు తామే కొడవళ్ళై ఎదురుచూస్తున్నారు కోతకు.

ఇది వారి వైరం కథ. కాని గోపమ్మ రోగం కథ వేరు. రంగయ్య హృదయం కథ వేరు. ఆమెకు రోగం హెచ్చినట్లే గాని తగ్గినట్లు రంగయ్య వినలేదు. అతని హృదయం క్రుంగినట్లేగాని పొంగినట్లు అతనికి తోచలేదు. గోపమ్మ తనకోసం ఎంత కలవరిస్తున్నదో! గోపమ్మ ఒడిలో తాను చిన్నిగంతులు వేశాడు, గోపమ్మదగ్గఱ పాలుత్రాగాడు, గోపమ్మ చేతిలో చద్దిపెరుగు తిన్నాడు, గోపమ్మ ముద్దులో పెద్దవాడయినాడు. నేటికి తాను ఆమెను చూడరాదు, ఆమె తనయొద్దకు రాలేదు! ఆమె రోగిష్ఠి! తాను మాత్రం వైద్యుడు.

గంటలు గంటలు ఆలోచన తెగక అటుమటలాడిపోయినాడు, జాములు జాములు గడిచినాయి. పవళ్లు రాత్రులు పరుగెత్తుకుపోయినాయి. ఇక రేపు సంక్రాంతి. సంక్రాంతినాడు తానెన్నడు గోపమ్మ పిన్నిని చూడకుండా ఉండలేదు. క్రిందటి సంక్రాంతి గుర్తువచ్చింది... అప్పుడూ గోపమ్మ స్థితి జబ్బే! అప్పుడన్నదికూడ, రంగయ్య బ్రదికి బాగుంటే వైద్యుడు కాలేడా, అని.

మఱి తాను వైద్యుడే నేడు. తన వైద్యం తన తల్లికి కాకపోతే యింకెవరికి?

భోగిపండుగ నాడల్లా ఆలోచించాడు. పండుగ నిండు లేనేలేదు వానిలో. ఆలోచనతో, దుఃఖంతో, తాపంతో, అర్థంకాని. వేగంతో, హృదయం నిద్రాదేవి పైటకొంగులలో ఊగులాడిందే కాని, గాఢంగా కౌగిలించుకోలేకపోయింది. అతనికా రేయిఅంతా ఒకటే దృష్టి, ఎపుడు తెల్లవారుతుందా, అని.

తొలికోడి కూసింది. తూర్పు కొండకు వెల్ల వేసినట్లు తెల్లవారింది. కొండకోనలలో ఎఱ్ఱ రంగులు తోచాయి. క్షణంలో మింటిపందిరి సర్వం వజ్రవర్ణమయింది.

వేఱు ఆలోచనలు లేని మనస్సుతో రంగయ్య సరాసరి గోపమ్మ యింటికి బయలుదేరాడు. దారిలో సుబ్బిగాడు ఎదురైనాడు కఱ్ఱ కొడవళ్లతో. "మంచి శకునంరా సుబ్బిగా" అంటూ ఆగకుండా సాగిపోయినాడు రంగయ్య.

రంగయ్య వెంటపడి, "మఱి రండి బాబయ్యా అప్పిడే మనోళ్లంతా యెల్లారు," అన్నాడు.

రంగయ్య తటాలున అన్నాడు, "ఆఁ... సమయానికి వచ్చావురా దేవుడిలాగా. గోపమ్మ పిన్నికి మందు వెయ్యాలి. అందులో కెన్నో అడివి ఆకులు, పూవులు కావాలిరా. మన మాలవాళ్లనందరినీ పిలవరా, మీరంతా ఏటిగట్టుకుపోయి యివి తీసుకురావాలి, అరగంటలో రావాలిరోయి" అంటూ కొన్ని ఆకులు పూవులు పేర్కొన్నాడు. సుబ్బిగాడు కఱ్ఱ నేలను కొడుతూ బుఱ్ఱ గోకుకొంటూ, "మఱి కోత మాటేంటి దొరా" అన్నాడు.

"నామాట వినరా" అంటూ రంగయ్య గోపమ్మ యింటికి వెళ్ళాడు. బైట గదిలోనే పడుకుంది గోపమ్మ. రంగయ్యను చూస్తూనే ఆమె ప్రాణాలు లేచివచ్చాయి. "లేవవద్దు పిన్నీ, హైరాన పడకు" అంటూ వచ్చి మంచంమీద కూర్చొన్నాడు. నాడి చూశాడు, నిరాశగా పెదవి విఱిచాడు. "పిన్నీ, రోగం స్థితి—"

గోపమ్మ వాని పెదవులు నిమురుతూ "ఇంకా రోగంస్థితి యేముంది? ఇక మీ స్థితి చూసుకోండి. ఈ గోపమ్మ కిక—" అంటూ కళ్లనీళ్లు పెట్టుకొంది.

రంగయ్య అన్నాడు, "కన్నీరు వద్దు పిన్నీ. కన్నులలో ఆనాటి తేట అంతగా కనపడదే! అనుకున్నంతా అయింది."

రంగయ్య ధైర్యంగా లేచాడు. దీక్షగా కిటికీ యొద్దకు పోయి నిల్చున్నాడు. "కాని పిన్నీ భయం లేదు. కావలసిన మూలికలు తెప్పిస్తున్నాను. పది నిముసాలలో మాలవాళ్ళు తీసుకవస్తారు. రోగం ఎందుకు కుదరదో చూస్తా" అంటూ టెంగ్రమింగు కొంటూ పలికాడు.

"ఇటురా రంగా" అంటూ గోపమ్మ అతనిని కౌగిలించుకొన్నది. ఆకౌగిలి మురిపెంలో తాను చనిపోతే బాగుండు ననిపించింది రంగయ్యకు. అంత వేడిగా, ముద్దుగా, స్వర్గంగా ఉన్నదా కౌగిలి!

ఇంతలో మాలవాళ్లు వచ్చిపడ్డారు మూటెడు మూలికలతో, రంగయ్య ఆత్రతతో అవన్నీ అందుకొన్నాడు. వాకిలి తలుపు వేశాడు. గచ్చు నేలను దినుసులు, ఆకులు, పూవులు పోసి నూరటం మొదలు పెట్టాడు. మాలవాళ్లు తిరిగి పొలంవైపు కాబోలు వెళ్లారు.

పొలంలో ఉన్నది సంక్రాంతి పొలుపంతా! మావికొమ్మలలో కోకిలమ్మలు కూశాయి. పూలపొదులలో చివురు రెమ్మలు విరిశాయి. పైరుగాలులలా తీపి తేనెలు రాలాయి. పంటకాడలలో సుబురుగింజలు వ్రాలాయి. పొలంగట్లు కొడవళ్ల వరవళ్లతో కలగిపోయినాయి. పొలంపైరు కొడవళ్లవడులలో, కొడవళ్ళ నడలలో, కొడవళ్ళ వంపులలో సురిగి నేల కొరిగింది.

రామయ్యతాలూకు మాలవాళ్లు యమభటులలా పని చేశారు, రంగయ్య ఎకరంపైరు ఒక్క జాముసేపటిలో కోసి రాసి వేశారు. నిండుకుండ పగిలి నీళ్లు చిందినట్లు, నిండుపైరు నేలపై పండుకొన్నది. భూదేవి పూర్ణగర్భంనుండి ధాన్యలక్ష్మి బైటపడి తల్లి పొత్తికడుపులో ఒత్తుకు పోయింది.

వస్తూనే దూరాన రంగయ్యపాలేర్లు చూశారీ విపత్తు. పొలానికి పరుగులెత్తటం వ్యర్థమని తిరిగి గోపమ్మతల్లి యింటికే పరువెత్తారు.

రంగయ్యదృష్టి గోపమ్మమీదనే ఉన్నది. మనసు మందు మీదనే ఉన్నది. వాక్కు ధన్వంతరీ స్తోత్రంలో ఉన్నది. శరీరం తిరిగి దక్కని ప్రియపరిసరాలలో ఉన్నది.

కిటికీ బైట సుబ్బిగాడు. "రంగయ్యగారూ" అని కేక వేశాడు. తదేందీక్షతో వున్న రంగయ్యకు ఆ పిలుపు వినబడలేదు. సుబ్బిగాడు గండుపిండం. అదేపనిగా పిలువసాగాడు. రంగయ్య ఉండిఉండి "...శ్..." అన్నాడు. కాని కదలలేదు, మెదలలేదు.

సుబ్బిగాడు అరిచాడు, "అరుగో బాబూ, రామయ్యగోరు తిరిగే వత్తుండారు పైరంతా కోసుకుండి."

రంగయ్య మారుపలుకలేదు. మందు నూరుతున్నాడు. శ్లోకాలేవో పఠిస్తున్నాడు. నవ్వుతూ తలుపు తీసుకు లోనికి వచ్చి తనకు వెనకగా నిల్చున్న రామయ్యనుకూడా గమనించలేదు.

సుబ్బిగాడు భయపడుతూ, పౌరుషంతో కిటికీ బైటనుంచి అంటూనే ఉన్నాడు, "ఏం దొరయ్యా రంగయ్యగోరూ—"

రంగయ్య కోపంతో తలయెత్తి "శ్..." అన్నాడు కటువుగా.

"ఏం ఇస్సులు బాబూ, నిండు పైరు కొత్తా కొట్టుకు పోయారు. ఇక్కండేటో నూరుతుండారు మీరు."

"శ్...గోపమ్మ తల్లికన్న నాకా పైరు ఎక్కువ కాదు," అంటూ లేచి కిటికీ మూసివచ్చాడు. ఇప్పటికీ రామయ్యను గమనించనేలేదు, తన కన్నులు మాత్రం తెలుచుకునే ఉన్నాయి.

ఆ ఒక్కమాటకు రామయ్య గుండెలు తలుక్కునిపోయినాయి. తాను గోపమ్మ కన్నకొడుకు. రంగయ్య గోపమ్మకు ప్రక్కయింటివారి అబ్బాయి. పరాయివాడి ఎకరం పైరుకోసం తాను పరుగెత్తాడు, తల్లి చావుబ్రదుకుల మధ్య వ్రేలుతుంటే. రంగయ్య, పరాయివాడి తల్లిని బ్రతికింప పరువులెత్తి వచ్చాడు, తన ఎకరం పైరుకారు దొంగలపాలుచేసి. తన కన్నుల ముందు కనపడేది అనుక్షణము ఆ ఎకరంపైరే. రంగయ్యకు ప్రతి నిముసం కనిపించి గుండెలు తతిచేది తన తల్లిరూపు!

గోపమ్మ రంగయ్యకెందుకు ఎకరమిచ్చిందో, గోపమ్మ రంగయ్య పైరు ఎందుకు కోయించి యిప్పించిందో, గోపమ్మ రంగయ్య గేదెల నెందుకు ఇచ్చివేయమన్నదో, గోపమ్మ రంగయ్య శరీరాన్ని ఎందుకు కాపాడి రక్షించిందో, గోపమ్మ రంగయ్య మందుకై ఎందుకు ఆశించిందో, కనులు కప్పిన రామయ్యకు నేటిదాకా తెలియనేలేదు. ఆ నిముసంలో, రంగయ్య ముఖంలోని ఏకాగ్రతలో, గోపమ్మ తల్లి ముఖంలోని పుత్రానురాగంలో, ఆ గదిలో ఆనాడు తాండవించే స్వర్లోక సౌందర్యంలో, ఇవన్నీ రామయ్యకు తటిల్లత మెఱుపులా స్ఫురించినాయి. తటిల్లత కన్న పటుతరరయంతో పోయి కౌగిలించుకొన్నాడు రంగయ్యను.

రంగయ్య ఉలిక్కిపడి వెనక్కు చూశాడు. "తమ్ముడూ" అంటూ రామయ్య కన్నీరు కాల్వలుగా నిల్చియున్నాడు.

రంగయ్య కన్నులుకూడ చెమ్మరించినాయి. క్రిందనూరే మందులో కన్నీరు చిందుతుందని ఏడుపు దిగమ్రింగుకొన్నాడు.

రామయ్య ఏడుపుగొంతుతో అస్ఫుటంగా, కాని నిర్మలంగా, అన్నాడు "తమ్ముడూ, నీ ఎకరం నీవు తీసికో; నీ పైరు నీవుతీసికో, నీ గేదెలు నీవు తీసికో. రంగయ్యా, ఆ పూరికొంపలో ఏముంటావు, వానకు తడుస్తూ ఎండ కెండుతూ. రా, మాయింటిలోనే ఉండు. నేనూ ఒంటరిగాడిని—"

ఇక మాటాడలేకపోయినాడు. ఇద్దరూ గోపమ్మ తల్లివంక చూశారు. గోపమ్మతల్లి కన్నులతో నవ్వింది. అది తుది నవ్వు. ఆరే దివ్వెలా భగ్గున వెల్గింది. దివ్య జ్యోతిలా అవతరిస్తూనే అంతర్ధానమయింది.